క్లుప్తంగా

బీసీలపై దాడి దుర్మార్గం


పార్థసారథి

ఏలూరు (టూటౌన్): బీసీలపై దాడి దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పార్థసారథి యాదవ్ అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండ వారి పల్లి గ్రామంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆర్ రమేష్ యాదవ్‌పైనా, రాష్ట్ర గ్రంథాలయ మాజీ చైర్మన్ వేల్పుల రాముపైనా టీడీపీ గూండాలు, కార్యకర్తలు దాడి చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో బీసీలను టార్గెట్ చేసి దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ఇటీవల కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ బీసీ మహిళ ఉప్పాల హారిక, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావులపైనా జరిగిన దాడులను బీసీల తరుపున ఖండిస్తున్నామని పార్థసారథి యాదవ్ తెలిపారు.

ఓటమి భయంతోనే దాడి


మాట్లాడుతున్న సంజీవ్ కుమార్

దెందులూరు: ఓటమి భయంతోనే ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్‌పై బుధవారం పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నిక సందర్భంగా దాడి చేయడం టీడీపీకి ఓటమి భయమే కారణమని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడులో విలేకర్లతో మాట్లాడారు. పులివెందులను వైఎస్సార్‌సీపీ ఖాతాలో వేసుకోవటం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల శ్రేణులపై దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం సంవత్సరం కాలంలో ప్రజాదరణ కోల్పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన దాడి ఒక వ్యక్తిపై కాదని, రాష్ట్రంలో బీసీల అందరిపైనా అని తాము భావిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీపై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని సంజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు.

ఏలూరులో శ్రీ శ్రీ కళావేదిక సింగర్స్ ఫెస్ట్


మాట్లాడుతున్న పార్థసారథి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక నిరంతర సాహిత్య క్రతువులో భాగంగా అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ నెల 9న ఏలూరులో సింగర్స్ ఫెస్ట్ నిర్వహించనున్నట్టు శ్రీ శ్రీ కళావేదిక నేషనల్ ప్లానింగ్ అధికారి, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి తెలిపారు. ఏలూరు మహాలక్ష్మి గోపాలస్వామి కళ్యాణ మండపంలో శ్రీ శ్రీ కళావేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరి కోటి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్థసారథి మాట్లాడారు. మహాలక్ష్మి గోపాలస్వామి కళ్యాణ మండపంలో 100 మంది సింగర్స్‌తో నాన్ స్టాప్ ట్రాక్ సింగింగ్ పేరిట అతి పెద్ద కార్యక్రమం నిర్వహించి, గాయకులు అందరికీ స్వర కిరీటి బిరుదు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లాశాఖ కన్వీనర్ జి.కృష్ణమనోహర్, ఉపాధ్యక్షుడు శొంఠియాల కస్తూరిరావు, కోకన్వీనర్ ఎంజే సుజయ్ కృష్ణ, మహిళా అధ్యక్షురాలు శ్యామల హరికోటి, కార్యదర్శులు గోరింక ఐజక్, పీ. సూర్యప్రకాష్, యజ్ఞ ప్రసాద్ చంద్రు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతి అద్భుతం


స్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఇటలీ పర్యాటకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు సంస్కృతి ఎంతో అద్భుతమని, తమ హృదయాలను దోచుకుందని ఇటలీకి చెందిన పర్యాటకులు అలెగ్జాండర్, జార్జా, క్యార, బెనెదత్త అన్నారు. ఏపీలోని ప్రజా జీవనం, ఇక్కడి విద్యా విధానాలపై అధ్యయనం చేయడంతో పాటు సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకోవడానికి ఏపీ పర్యటిస్తున్న నలుగురు ఇటలీకి చెందిన పర్యాటకులు బుధవారం నగరంలోని సెయింట్ అంథోని స్కూల్‌కు విచ్చేశారు. తెలుగు ప్రజల ఆతిథ్యం తమను అబ్బురపరిచిందని, ఇక్కడి ప్రజల ప్రేమ, ఆప్యాయత తమ హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని వారు అన్నారు. తొలుత వారికి పాఠశాల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫాదర్ తోట అంతోని, తోట ఎడ్వర్డ్, చుక్క కుమార్, చుక్క ఉష తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ షాపులు వెలవెల

- బెనర్జీ పేటలో ఖాళీగా ఉన్న 46 షాపులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న కాంప్లెక్స్
- వ్యాపారం లేక ఖాళీ చేసిన వ్యాపారులు


ఏలూరు బెనర్జీ పేటలో నిర్మించిన మదర్ థెరిస్సా మెమోరియల్ షాపింగ్ కాంప్లెక్స్


కాంప్లెక్స్ లోపల తాగి పడేసిన మద్యం బాటిళ్లు

ఏలూరు (టూటౌన్): సరిగ్గా పదేళ్ల క్రితం ఏలూరు నగరానికి మధ్యగా వెళుతున్న కృష్ణా కెనాల్ గట్టు వెంబడి ఉన్న చిరు వ్యాపారుల దుకాణాల సముదాయాన్ని నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. దీంతో దాదాపు 180 మంది వరకు వివిధ రకాల వ్యాపారులు రోడ్డున పడ్డారు. వారు అప్పటి ఎమ్మెల్యే బడేటి బుజ్జికి తమ గోడు వినిపించారు. తదనంతరం స్థానిక బెనర్జీపేటలోని మహాత్మాగాంధీ మున్సిపల్ పార్కు ప్రాంతంలో మదర్ థెరిస్సా మెమోరియల్ మున్సిపల్ కాంప్లెక్స్ పేరుతో 46 దుకాణాలు నిర్మించారు. మారుమూల ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడంతో వ్యాపారాలు లేక కాలక్రమేణా వాటిని వ్యాపారులు వదిలేశారు. వ్యాపారం బాగా జరిగే ప్రాంతాల్లో షాపులను అద్దెకు తీసుకుని వెళ్లిపోయారు. నేడు ఈ కాంప్లెక్స్‌లో 90 శాతానికి పైగా షాపులు ఖాళీగా ఉన్నాయి.

నోటీసులిస్తున్న కార్పొరేషన్

బెనర్జీపేటలో షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపును బట్టి రూ.2 లక్షలు నుంచి రూ.3 లక్షలు చెల్లించామని బాధిత వ్యాపారులు చెబుతున్నారు. అప్పట్లో భవిష్యత్తులో ఒక్క రూపాయి కూడా చెల్లించక్కర్లేదని చెప్పి, చాలాకాలం ఈ షాపులకు కార్పొరేషన్ నుంచి అద్దెలు వసూలు చేయలేదు. గతంలో పనిచేసిన అధికారులు సైతం బ్యాక్ లాగ్ డిమాండ్ నుంచి బెనర్జీపేట షాపుల బకాయిలను డిలీట్ చేసినట్టు చెబుతున్నారు. తాజాగా వీటికి అద్దెలు చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడం పట్ల వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నిరుపయోగంగా ఉన్న షాపులు

ఏటా ఆదాయం రూ.4.80 కోట్లు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం 746 షాపులు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 125 ఖాళీగా ఉండగా 621 షాపులు అద్దెకు నడుస్తున్నాయి. ప్రతి ఏటా కేవలం షాపుల అద్దె రూపంలో నగర పాలక సంస్థకు రూ.4.80 కోట్లు ఆదాయం సమకూరుతుంది.

మూడేళ్లకోసారి అద్దె పెంపు

సాధారణంగా మున్సిపల్ కాంప్లెక్స్ షాపులకు ప్రతి మూడేళ్లకోసారి 33 శాతం అద్దె పెంచాలి. దీనికి 18 శాతం జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంది. పెరిగిన అద్దె మొత్తానికి సంబంధించి ప్రతి మూడేళ్లకు ఒకసారి షాపు పాడుకున్న వ్యక్తి తిరిగి రెన్యూవల్ చేయించుకుంటూ ఉండాలి. షాపుల సర్వే నెంబర్‌ను బట్టి అద్దెలను కంప్యూటర్‌లో ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అవుతాయి. అయితే ఇక్కడ కార్పొరేషన్ సిబ్బంది మాయాజాలం కారణంగా కంప్యూటర్లను కూడా మేనేజ్ చేసేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. షాపుల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులు, ఓసీ కేటగిరీల వారీగా అద్దెలు నిర్ణయిస్తారు. షాపుల అద్దెలు సైతం సర్వే నెంబర్ల ఆధారంగా వేర్వేరుగా ఉంటాయి. బిర్లా భవన్ సెంటర్‌లోని మూడు వైపులా ఉన్న మున్సిపల్ షాపుల్లో మూడు రకాలుగా అద్దెలు ఉండటమే ఇందుకు నిదర్శనం.

మొక్కుబడిగా నిర్మాణం



కృష్ణా కెనాల్ బండ్ ప్రక్షాళనలో భాగంగా నాడు కాలువ గట్టువెంబడి ఉన్న వీధి వ్యాపారులను నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయించారు. తర్వాత వారికి బెనర్జీపేటలో షాపులను మొక్కుబడిగా నిర్మించి వదిలించుకున్నారు. తీరా అక్కడ వ్యాపారం లేకపోవడంతో వ్యాపారులు లబోదిబో మనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏలూరు

బాధితులను ఆదుకోవాలి



గతంలో కృష్ణా కాలువ వెంబడి వ్యాపారాలు కొనసాగించిన చిరు వ్యాపారులను నేటి పాలకులు ఆదుకోవాలి. అప్పట్లో చెప్పిన విధంగా కేటాయించిన వారికే ఆ షాపులు ఉండేలా చర్యలు తీసుకోవాలి. అద్దెలు చెల్లించడం లేదనే షాకుతో షాపులను లాగేసుకునే ప్రయత్నాలను విరమించుకోవాలి.

– బి.సోమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏలూరు

నేత్ర సంరక్షణ తప్పనిసరి


నేత్ర వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ రవి కిరణ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేత్ర సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రవి కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యుడు రవి కిరణ్ సూచించారు. స్థానిక చొదిమెళ్లలో శనివారపుపేట సొసైటీ ప్రెసిడెంట్ కోనేరు వంశీకృష్ణ, 27వ డివిజన్ ఇన్‌చార్జి ఎడ్లపల్లి శివ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ చొదిమెళ్ల ప్రజలకు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని చెప్పారు. ఎడ్లపల్లి శివ మాట్లాడుతూ ప్రజలకు శుక్ల పరీక్షలు, రెటీనా చికిత్సలు, కంటి సంబంధిత వ్యాధులకు పరీక్షలు ఉచితంగా అందించారని, దృష్టి లోపం ఉన్నవారికి చికిత్సలు చేశారని తెలిపారు. బాధితులకు ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశామని చెప్పారు. డాక్టర్ హేమలత, ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఏలూరు(మెట్రో): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 5 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న ×హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. హర్ ఘర్ తిరంగా అనేది జెండా ఎగరవేసే కార్యక్రమం కాదని, దేశభక్తిని వ్యక్తీకరించే మహోత్సవం అని పేర్కొన్నారు.

ఎస్సీలకు అండగా వైఎస్సార్ సీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఎస్సీలకు ఆది నుంచీ వైఎస్సార్ సీపీ అండగా ఉంటోందని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేర ఆనంద్ అన్నారు. ఈ నెల 12న నిర్వహించనున్న ఏలూరు జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం విజయవంతం కోరుతూ ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల ఎస్సీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం పార్టీ స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. పార్టీలకు అతీతంగా ఎస్సీలను ఆదుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎస్సీలను అణగదొక్కే విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. 2029 ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవడం ఒక్కటే ఎజెండాగా ఎస్సీ నాయకులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల పరిశీలకులు రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నలుకుర్తి రమేష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్ బాబు, పశ్లెం ప్రసాద్, నిట్ట లీల నవకాంతం, జయకర్, మున్నుల జాన్, సొంగ సందీప్, జిజ్జువరపు విజయ నిర్మల, మట్టా రాజు, పులవర్తి దేవానంద్, గొల్ల కిరణ్, కాటి సుధాకర్, చల్ల మేరీ రాజు, కొరపాటి ప్రభుదేవా, గోరింకల జగదీష్, ఇనపనూరి జగదీష్, తోటకూర కిశోర్, గంట రాజేశ్వరరావు, గారపాటి నాగేశ్వరావు, బల్ల రమేష్, పాత పెద్దిరాజు, మెతర సురేష్, కొవ్వాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకం కోల్పోతున్న ప్రభుత్వం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జయప్రకాష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) విమర్శించారు. ఏలూరు 11, 17వ డివిజన్లలో దాసరి రమేష్, బుద్ధాల రాము, ప్రభావతి, అబ్బాయి, కడలి వెంకటేశ్వర రావు, గుడివాక మోహన్, బత్తిన మస్తాన్ రావు, బొడ్డు వెంకటేశ్వర రావు, బలుసు బాబు, కొండేటి పోతురాజు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేపీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు ఇచ్చిన హామీలనుకు అమలు చేయకుండా ప్రజల నమ్మకాన్ని కోల్పోతోందని అన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన అధికారంలోకి వచ్చాక కూటమి నాయకులు హామీలు చూస్తుంటే భయం వేస్తోందనడం సిగ్గుచేటని తెలిపారు. అమలు చేసిన పథకాల్లో సైతం ఎంతో మంది లబ్ధిదారులను తొలగించి వారి జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడిదేసి శ్రీనివాస్, నెరుసు చిరంజీవులు, ఘంటా మోహన్ రావు, రావి నాని, దాలి వెంకటేష్, బండ్లమూడి సునీల్, పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

బందా మృతి సాహిత్య రంగానికి లోటు


నివాళులర్పిస్తున్న వైఎంహెచ్‌ఏ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ రచయిత బందా ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడం సాహిత్య రంగానికి, ఏలూరు నగరానికి తీరని లోటని పలువురు వక్తలు సంతాపం వ్యక్తం చేశారు. నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో బందా సంతాప సభ నిర్వహించారు. బందా సాహిత్య పరంగా మురళీమాధురి, సాంకేతికపరంగా జూట్ పరిశ్రమపై, చిత్రకళాపరంగా రాజా రవివర్మ చిత్రాలపై ఎన్నో రచనలు చేశారని వక్తలు గుర్తుచేశారు. బందా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎంహెచ్‌ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు అంబికా రాజా, ఉపాధ్యక్షుడు ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి గుడిపాటి లలితా శర్మ, సీహెచ్ సాయి తేజ, కానాల బాల వెంకట రమేష్, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఇరదల ముద్దుకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతరావు, కేబీ రావు, లంకా వెంకటేశ్వర్లు, ఎం సూర్యనారాయణ యాదవ్, పిలగల కొండలరావు, దువ్వి హేమ సుందర్, ఎంవీ రవీంద్ర, మారం హనుమంతరావు, కొమ్మన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మానవ వనరులకు భారత్ ఆధారం



పరిశోధనా పత్రాల పుస్తకాన్ని విడుదల చేసిన అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రపంచంలోనే యువ జనాభా అధికంగా ఉన్న దేశం భారతదేశమని, అందువల్లనే ప్రపంచ దేశాలన్నీ మానవనరుల కోసం భారతదేశంపై ఆధారపడుతున్నాయని కెన్యాలోని తుర్కాన విశ్వవిద్యాలయానికి చెందిన అనుబంధ ప్రొఫెసర్ జి.కుప్పురం తెలిపారు. స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఈ నెల 5, 6 తేదీల్లో భారతదేశ పునరుజ్జీవ పరివర్తనకు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో కుప్పురం ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. యువతులు, మహిళలు విద్యా, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉపాధి అవకాశాలు పొందే విషయాలపై అవగాహన కలిగించారు. దేశ విదేశాల నుంచి ఆచార్యులు, పరిశోధకుల నుంచి వచ్చిన పరిశోధనా పత్రాల సారాంశాన్ని పుస్తక రూపంలో వెలువరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు, హైదరాబాదులోని ఐసీఎఫ్ఏఐ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఉపకులపతి ఆచార్య తమ్మా కోటి రెడ్డి, న్యూఢిల్లీలోని ఐసీఎస్ఎస్ఆర్ మహిళల అభివృద్ధి అధ్యయన కేంద్రం, ప్రొఫెసర్ మణి మేఖలై మాట్లాడారు. సదస్సును కళాశాల సోషల్ సైన్సెస్, కామర్స్, సెంటర్ ఫర్ విమెన్ స్టడీస్ ఐక్యూఏసీ సంయుక్తంగా నిర్వహించారు. హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ ఎంఎల్‌వీ ప్రసాద్, కెనడా యూనివర్శిటీకి చెందిన ఆచార్య బాల నిక్కు పాల్గొని ప్రసంగించారు.

గద్దర్‌కు ఘన నివాళి


గద్దర్‌కు నివాళిలర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రజలను చైతన్యం చేయడం కోసం గద్దర్ ఎనలేని కృషి చేశారని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో గద్దర్ రెండో వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డాక్టర్ ఎస్ఏడి పాల్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరై బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూకపెయ్యి కార్తీక్, సర్పంచ్ చిలకా సుబ్బారావు, కె.రాజేష్, ప్రసాద్, గోవింద్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం


మాట్లాడుతున్న రెడ్డి శ్రీనివాసడాంగే

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని, ఎన్నికల ఇచ్చిన హామీలను అమలులో విఫలమైందని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం స్థానిక శ్రీ కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షుడు యలగాడ దుర్గారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోరుతూ ఆగస్టు 9న క్విట్ ఇండియా దినోత్సవం రోజున టూల్ డౌన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో బీకేఎంయూ జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.కిషోర్, దిజోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బి.నారాయణరావు, ఎస్ శ్రీనివాస్, డి.వెంకటేశ్వరరావు, డి.అప్పారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డికార్ల నాగబాబు, యూనియన్ నాయకులు బంగారు దుర్గాప్రసాద్, గోవాడ మల్లేశ్వరరావు, ఎ.ప్రసాద్, మాదుగుల జగదీష్, బట్టు నాగబాబు, గండి గవరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలరాజు నిజాయతీ నిరూపించుకోవాలి

ఏలూరు (టూటౌన్): పోలవరం ఎమ్మెల్యే చిర్రిబాలరాజుపై వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో తన నిజాయతీని నిరూపించుకోవాలని కూటమి ప్రభుత్వం రూ.100 కోట్ల అవినీతిని నిగ్గు తేల్చాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం మాట్లాడుతూ ఇటీవల కూటమి నాయకుల ఆడియో లీక్లో పోలవరం ఎమ్మెల్యే బాలరాజు 100 కోట్ల అవినీతికి పాల్పడినట్లుగా వచ్చిన ఆరోపణల విషయంలో జిల్లాలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతుందని, ఇందులో నిజా నిజాలు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే బాలరాజు తన నిజాయితీని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక దొండపాడులో ఉమా ఎడ్యుకేషన్ – టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రతినిధులు బుధవారం నగరంలోని ఏఆర్‌డీజీకే మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్‌లో 2016 దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది వైకల్య నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైకల్యం ముందుగా గుర్తించడం, వైకల్యం వచ్చిన తర్వాత ఎదుర్కోవాల్సిన విషయాలు, దివ్యాంగుల హక్కులను వివరించారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 08812 – 249297, 73865 65469లో సంప్రదించాలని సూచించారు. ప్రాధానోపాధ్యాయుడు వి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధిపై 8న సదస్సు


సదస్సు కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా సమగ్ర అభివృద్ధిపై సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 8న శుక్రవారం ఏలూరులో సదస్సు నిర్వహించనున్నట్టు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. బుధవారం స్థానిక స్ఫూర్తి భవనంలో సీపీఐ నాయకులు జిల్లా సదస్సుపై ముద్రించిన కరపత్రం విడుదల చేశారు. సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా, సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 23 నుంచి 25 వరకు ఒంగోలులో జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని సదస్సు ఏర్పాటుచేశామని కృష్ణ చైతన్య తెలిపారు. జిల్లా అభివృద్ధిని కాంక్షించే వారంతా పాల్గొనాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, వరక శ్యామల, నాయకులు పాల్గొన్నారు.

చాటపర్రు కార్యదర్శిపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోన అనుమతులు లేకుండా రెండతస్తుల భవనం నిర్మిస్తున్నా పట్టించుకోని పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అరిగెల యోహాను బుధవారం కలెక్టరేట్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బిల్డింగ్ యజమాని తాండ్రంకి రాజేష్ అనే వ్యక్తి వద్ద నుంచి పంచాయతీ కార్యదర్శి భారీ మొత్తంలో ముడుపులు తీసుకున్నట్టు ఆరోపించారు. గతంలో ఇదే స్థలం వ్యవహారంలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ల్యాండ్ కన్వెర్షన్ చార్జీలు కట్టించుకుని ఊరుకున్నారని గుర్తుచేశారు. పంచాయతీకి కట్టాల్సిన బెటర్‌మెంట్ చార్జీలు, బిల్డింగ్ ప్లాన్ అప్రూవర్ తీసుకోకుండా తాజాగా మళ్లీ నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ కార్యదర్శి ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అవినీతికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఏలూరు
90102 23729
70133 28923
Office mail : tpgadvt@gmail.com